


శ్రీవారి బ్రహ్మోత్సవ వైభవం

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. స్వామి వారు సోమవారం ఉదయం చిన్న శేషవాహనం, రాత్రి హంస వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కళాకారుల కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో ప్రదర్శనలు ఇవ్వడం పూర్వ జన్మ సుకృతమని కర్ణాటకకు చెందిన భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. నాదనీరాజనం వేదికపై కళాకారుల నాట్య ప్రదర్శన అబ్బురపరిచింది.

నేటి వాహనాలు

బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు మంగళవారం ఉదయం మలయప్పస్వామి సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. శ్రీవారి దశావతారాల్లో నాలుగోది నరసింహ అవతారం. యోగ శాస్త్రంలో సింహాన్ని బలానికి(వహనశక్తి), వేగానికి(శీఘ్ర గమన శక్తి) ఆదర్శంగా భావిస్తారు. భక్తుడికి సింహబలం అంతటి భక్తి బలం కలిగినప్పుడు భగవంతుడు అనుగ్రహిస్తాడని అంతరార్థం.

ముత్యపుపందిరి వాహనం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 3వ రోజు మంగళవారం రాత్రి మలయప్పస్వామి ముత్యపు పందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. జ్యోతిష్య శాస్త్రం చంద్రునికి ప్రతీకగా ముత్యాలను తెలియజేస్తుంది. శ్రీకృష్ణుడు ముక్కుపై, మెడలో ముత్యాల ఆభరణాలు ధరించినట్టు పురాణాల్లో ఉంది. ముత్యపు పందిరి వాహనంలో స్వామి వారిని దర్శించినా, స్తోత్రం చేసినా సకల శుభాలు కలుగుతాయని పురాణ ప్రశస్తి. చల్లని ముత్యాల కింద నిలిచిన శ్రీనివాసుని దర్శనం తాపత్రయాలను పోగొట్టి, భక్తుల జీవితాలకు చల్లదనాన్ని సమకూర్చుతుంది.



కోదండ రామాలయానికి రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : చిన్నగొట్టిగల్లు మండలం దిగువూరు పంచాయతీ గాండ్లపల్లిలో కోదండ రామాలయం నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి రూ.50 వేలు విరాళం ఇచ్చారు. ఆయన సోమవారం తుమ్మలగుంట ఆలయం వద్ద నిర్వాహకులకు నగదు అందజేశారు. పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించేందుకు తన వంతు బాధ్యతగా సహాయ సహకారాలు అందజేస్తానని స్పష్టం చేశారు. పంచాయతీ సర్పంచ్ శంకర్ రెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మోహిత్‌రెడ్డిని సత్కరిస్తున్న జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ షణ్ముగం

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

తిరుపతి రూరల్: తక్కువ పెట్టుబడితో నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంటల కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన షణ్ముగం సోమవారం తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి తుమ్మలగుంటలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అంచెలంచెలుగా ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఎస్ఆర్‌పీ భానుమూర్తి, శ్రీధర్, అయ్యప్పనాయుడు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

పాకాల : రెండు కిడ్నీలు దెబ్బతిని ఇబ్బంది పడుతున్న దామలచెరువుకు చెందిన అశోక్‌కు సోమవారం తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తరఫున చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి రూ.20 వేల సాయం అందజేశారు. రెండు నెలలుగా ప్రతి రోజూ డయాలసిస్ చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నట్టు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. చలించిన మోహిత్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం నుంచి వచ్చేలా చర్యలు చేపడతానని, అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ త్వరితగతిని వచ్చేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. స్విమ్స్ వైద్యులకు ఫోన్ చేసి అశోక్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



సప్తగిరి బ్యాంకును ప్రారంభిస్తున్న కలెక్టర్, అధికారులు

తిరుపతి అర్బన్: సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. తిరుపతి రూరల్ మండలం పుదిపట్లలో ఏర్పాటుచేసిన సప్తగిరి గ్రామీణ బ్యాంకు 237వ శాఖను ఆయన సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు బ్యాంకు లింకేజ్ రుణాలను ప్రజలకు చేరువచేయడంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు ముందుంటాయని కొనియాడారు. బ్యాంకులు సెక్టార్ రుణాలు విరివిగా ఇవ్వాలని, వార్షిక ప్రణాళిక లక్ష్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ పుదిపట్ల శాఖ తిరుపతి జిల్లాలో 47వదని తెలిపారు. ముద్ర యోజన పథకం ద్వారా ఇప్పటికే రూ.1000 కోట్ల రుణాలు ఇచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ అధికారి జి.జయకుమార్, తిరుపతి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుభాష్, పుదిపట్ల శాఖ మేనేజర్ వంశీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

25 నుంచి రుద్ర పాదాల ముక్కోటి ఉత్సవాలు

చంద్రగిరి: తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి(ముక్కోటి) ఆలయంలో ఈ నెల 25 నుంచి రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి తెలిపారు. 28వ తేదీ సాయంత్రం 3.30 నుంచి 5 గంటల వరకు రుద్రపాదాల ముక్కోటి నిర్వహిస్తామని, చంద్రగ్రహణం కారణంగా సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని మూసివేయనున్నట్టు తెలిపారు.

పేదలకు అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న మద్దులేటి, యువ అన్వేష్, చిల్లీస్ అధినేత అంజి

తిరుపతి కల్చరల్: ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం చిల్లీస్ రెస్టారెంట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఇందులో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్.మద్దులేటి, మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.యువ అన్వేష్ ముఖ్య అతిథులుగా హాజరై సుమారు 500 మందికి వెజ్ బిరియాని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిల్లీస్ అధినేత అంజి, చేచర్ల మురళి, బండి శేఖర్, నవతా రమేష్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్: తిరుపతి–పాపానాయుడుపేట రోడ్డులో నడుస్తున్న ఆరు ఆర్టీసీ బస్సుల్లో గిఫ్ట్‌బాక్స్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వారు దిగే సమయంలో టికెట్ వెనుక వైపు వారి పేరు, ఫోన్ నంబర్ రాసి గిఫ్ట్ బాక్సులో వేయాల్సి ఉంది. అధికారులు 15 రోజులకు ఒకసారి వాటిని లాటరీ తీసి బహుమతులు అందజేస్తున్నారు. సోమవారం ఎస్.సునీమాబీ, పి.రాంప్రసాద్, ఆర్.అంకయ్యకు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, మంగళం డిపో మేనేజర్ భాస్కర్‌రావు, అసిస్టెంట్ డిపో మేనేజర్ నిర్మల బహుమతులు ఇచ్చారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

తిరుపతి కల్చరల్: రక్త దానం ప్రాణదానంతో సమానమని రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం తెలిపారు. రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ ద్వారా ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యుల్లో అవగాహన పెంచి వారి కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల ద్వారా ఏడాదికి పది ఉచిత రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సాయికుమార్, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు, నాగేశ్వర్, మునిరాజ, రామాంజులు, నాగరాజు, సత్యనారాయణ, బాలాజీ పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యం



గ్రామస్తులకు కంటి అద్దాలు అందజేస్తున్న ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి

రామచంద్రాపురం: పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. నడవలూరులో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు భానుకుమార్‌రెడ్డి, సర్పంచి గణపతిరెడ్డి, కమ్మకండ్రిగ వైస్ చైర్మన్ వేణు, మహిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే జగనన్న ఆశయం



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న మేయర్ శిరీష

తిరుపతి తుడా : ప్రజల ఆరోగ్య పరిరణణే ముఖ్యమంత్రి జగనన్న ఆశయమని మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. ఆమె సోమవారం జీవకోన గురుకృప స్కూల్, ఖాదీ కాలనీ మున్సిపల్ పార్క్ సమీపంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పైసా ఖర్చు లేకుండా ఇంటి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించడం జగనన్న ప్రభుత్వానికే సాధ్యమని తెలిపారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు వచ్చిన ప్రజలకు ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాధా మురళి, ఆరోగ్య అధికారి డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, సూపరింటెండెంట్ రవి, జూనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే సీఎం ధ్యేయం



వైఎస్సార్ సీపీ నేతలను సత్కరిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

తిరుపతి కల్చరల్: మహిళల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని వైఎస్సార్ సీపీ నేతలు కోరారు. రామచంద్ర పుష్కరిణి వద్దనున్న పొన్నాల చంద్ర ఫంక్షన్ హాలులో సోమవారం పేదరిక నిర్మూలన సంస్థ శ్రీగణపతి మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి, విజయరెడ్డి, పొన్నాల చంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తిరుపతి ప్రజల సంక్షేమానికి, నగర అభివృద్ధికి ఎమ్మెల్యే భూమన, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, శివ ఆచారి, కృష్ణవేని, శ్రీగణపతి సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లలో జీబ్రా లైన్ల ఏర్పాటుకు చర్యలు



కమిషనర్ హరితకు సమస్యను చెబుతున్న ప్రజలు

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో నూతనంగా అభివృద్ధి చేసిన రోడ్లతోపాటు ప్రధాన కూడళ్లలో జీబ్రా లైన్లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తెలిపారు. ఆమె సోమవారం డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, అధికారులతో కలిసి స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 17, స్పందనకు 15 ఫిర్యాదులు వచ్చినట్టు తెలిపారు. అనంతరం అధికారులతో సమావేశమై ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, సెక్రటరీ రాధిక, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీబీ బాలసుబ్రమణ్యం, మున్సిపల్ ఇంజినీర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు



మాట్లాడుతున్న టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి

తిరుపతి కల్చరల్: తిరుపతి అభివృద్ధిని చూసి ఓర్వలేకే మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మతిభ్రమించి విమర్శలు చేస్తున్నారని తిరుపతి కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సుగుణమ్మ, ఆమె భర్త వెంకటరమణ ఏనాడూ తిరుపతి అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తిరుపతి పారిశుద్ధ్యం కోసం టీటీడీ బడ్జెట్‌లో ఒక శాతం నిధుల కేటాయింపునకు నిర్ణయం తీసుకుంటే దిక్కుమాలిన విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. గత టీడీపీ పాలనలో మాస్టర్ ప్లాన్ రోడ్లకు ఆమోదం తెలిపి పట్టించుకోకుండా వదిలేశారని తెలిపారు. వాటిని డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అమలు చేసి ప్రజలకు ట్రాఫిక్ నుంచి విముక్తి కల్పించారని కొనియాడారు. టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ వాసు యాదవ్ మాట్లాడుతూ అభివృద్ధిని గ్రాఫిక్స్‌లో చూపి ప్రజలను భ్రమింపజేసే చరిత్ర టీడీపీదన్నారు. సమావేశంలో టౌన్ బ్యాంకు డైరెక్టర్ అనిల్ రాయల్, నాగిరెడ్డి, ఖాశింబాయ్, దొరబాబు, సురేష్‌రెడ్డి, నాదముని, మాకం చంద్ర, వెంకటేష్ రాయల్, చింతా రమేష్ పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరిదేవిగా గంగమ్మ



మీనాక్షి దేవిగా కన్యకాపరమేశ్వరి | శ్రీలక్ష్మీగా మూలస్థానమ్మ | గాయత్రిదేవిగా తిరుపతి గంగమ్మ | సిద్ధేశ్వరి అమ్మవారు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ సోమవారం బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు, హోమం చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని బాలా త్రిపుర సుందరిదేవి అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. కొత్త వీధిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు మీనాక్షి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పాలక మండలి చైర్మన్ సత్యనారాయణ, కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

లక్ష్మీ అలంకరణలో మూలస్థాన ఎల్లమ్మ

చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ సోమవారం సాయంత్రం శ్రీలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.



బాలా త్రిపుర సుందరిగా తాతయ్యగుంట గంగమ్మ

గాయత్రి దేవిగా తిరుపతి గంగమ్మ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువు కట్ట మీద వెలసిన తిరుపతి గంగమ్మ సోమవారం గాయత్రి దేవిగా దర్శనమిచ్చారు. సాయంత్రం మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని దీపాలు వెలిగించారు.

తలకోనలో...

భాకరాపేట : తలకోన సిద్ధేశ్వరమ్మ సోమవారం గాయత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ప్రత్యేక హోమాలు, కుంకుమార్చన చేశారు. ఆలయ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, ఈవో జయకుమార్ భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పంచభూతాలను సక్రమంగా వినియోగించుకోవాలి

తిరుమల: పంచభూతాలను సక్రమంగా వినియోగించుకోవాలని వేదాలు ఘోషిస్తున్నాయని గుజరాత్‌లోని సోమనాథ్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి వెంపటి కుటుంబశాస్త్రి తెలిపారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల నాదనీరాజన వేదికపై ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీనివాస వేద విద్వత్ సదస్సు సోమవారం రెండో రోజుకు చేరుకుంది. ఆయన మాట్లాడుతూ వేద విజ్ఞానాన్ని భావితరాలకు అందించేందుకు టీటీడీ వేద విద్వత్ సదస్సు నిర్వహించడం ముదావహమన్నారు. ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రత్యేకాధికారి విభీషణ శర్మ పాల్గొన్నారు.

బర్డ్‌లో అనస్తీషియా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న రాచపల్లి రెడ్డెప్పరెడ్డి, ప్రదీప్ కుమార్

తిరుపతి తుడా: బర్డ్ ఆసుపత్రిలో సోమవారం ప్రపంచ అనస్తీషియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి ప్రత్యేక అధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్ప రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనస్తీషియా ఒపీనియన్ మేరకు రోగికి తదనంతర చికిత్స ఉంటుందన్నారు. 1846లో మొదట అనస్తీషియా ప్రదర్శన విజయవంతమైందని, నాటి నుంచి అక్టోబర్ 16న ప్రపంచ అనస్తీషియా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్లు ప్రదీప్‌కుమార్, కిషోర్, రామమూర్తి, దీపక్, శుభశ్రీ, గిరిజ పాల్గొన్నారు.

ధరణి డిపాజిట్ పథకంలో అధిక వడ్డీ

చంద్రగిరి: రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్నది చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో ధరణి డిపాజిట్టు పథకం కింద అధిక వడ్డీ పొందవచ్చని మేనేజర్ సంకీర్తన శ్రీ తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 450 రోజుల కాల పరిమితితో ధరణి డిపాజిట్ పథకాన్ని ప్రవేశపెట్టామని, రూ.వెయ్యి నుంచి ఎంతైనా డిపాజిట్టు చేసుకోవచ్చన్నారు. 8 శాతం వడ్డీ ఇస్తామని, సీనియర్ సిటిజన్లకు 8.5 శాతం వడ్డీ చెల్లిస్తామన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు.

నీటి వృథాను అరికడదాం

తిరుపతి సిటీ : మానవాళికి నీరు ప్రాణాధారమని, నీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఫుడ్ అండ్ టెక్నాలజీ కోఆర్డినేటర్, ఎస్వీయూ ఈసీ మెంబర్ కోలా మంజుల తెలిపారు. ఎస్వీయూ ఫుడ్ అండ్ టెక్నాలజీ, హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నీటి వినియోగం, నీటి వృథాను అరికట్టడం, పొదుపు చేయడం వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆహార దినోత్సవ ప్రాధాన్యతను తెలిపే కరపత్రాలు ఆవిష్కరించారు.

మౌనికకు డాక్టరేట్



తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ హోమ్ సైన్స్ పరిశోధక విద్యార్థి దక్షిణపు మౌనికకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆమె హోమ్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.శిరీష పర్యవేక్షణలో మిల్లెట్స్ యాంటీ న్యూట్రియంట్స్ అండ్ దెయిర్ థెరపుటిక్ ఎఫెక్ట్ ఆన్ మెటబాలిక్ సిండ్రోమ్ అనే అంశంపై పరిశోధన చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మహతిలో భక్త ప్రహ్లాద నాటకంలోని సన్నివేశం

తిరుపతి కల్చరల్: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో రెండో రోజైన సోమవారం తిరుపతిలోని పలు వేదికలపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహతి కళాక్షేత్రంలో సురభి వినాయక నాటక మండలి సోమవారం రాత్రి భక్త ప్రహ్లాద పౌరాణిక పద్య నాటకాన్ని ప్రదర్శించారు. అన్నమాచార్య కళామందిరంలో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు జి.బినతి, పి.శ్రీలత బృందం సంగీత కచేరి నిర్వహించారు. రామచంద్ర పుష్కరిణి కళా వేదికపై దాససాహిత్య ప్రాజెక్టు కొండలరావు కళా బృందం సంగీత కచేరి చేపట్టారు.

త్రిపురాంబికకు రూ.లక్ష ప్రోత్సాహక బహుమతి



త్రిపురాంబికకు చెక్కు అందజేస్తున్న తిరుపతి చెస్ అసోసియేషన్ సభ్యులు

తిరుపతి ఎడ్యుకేషన్ : విశాఖపట్నంలో ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించిన 36వ బాలికల జాతీయ స్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో తిరుపతికి చెందిన క్రీడాకారిణి త్రిపురాంబిక అండర్–11 కేటగిరిలో 6వ స్థానంలో విజేతగా నిలిచింది. చెస్ చాంపియన్‌షిప్ ముగింపు సందర్భంగా టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ.సుబ్బారెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున చెస్ క్రీడాకారులకు రూ.లక్ష ప్రోత్సాహక బహుమతిని ప్రకటించారు. దీనికి సంబంధించిన రూ.లక్ష చెక్కును సోమవారం త్రిపురాంబికకు తిరుపతి చెస్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస సూరి, బాలాజీ చౌదరి, అమర్‌నాథ్ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున బహుమతిని అందజేసిన వైవీ.సుబ్బారెడ్డికి క్రీడాకారిణి తండ్రి వి.ప్రతాప్ కృతజ్ఞతలు తెలిపారు.

దామలచెరువులో కేరాఫ్ కదిరిపల్లి సినిమా షూటింగ్



సినిమా షూటింగ్ ప్రారంభిస్తున్న రెడ్డెప్పరెడ్డి

పాకాల : మండలంలోని దామలచెరువులో సోమవారం కేరాఫ్ కదిరిపల్లి సినిమా షూటింగ్ ప్రారంభమైంది. సిద్ధురాయల్ కథానాయకుడిగా, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్‌గా సాహితీ, నటీనటులుగా హరీష్, పవన్ నవ్వుల వినోద్, ఠాగూర్ సురేష్, శ్రీమని నటిస్తున్నారు. ఈ సినిమాకు ఎంఎస్ శివారెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. వినీత్‌కృష్ణ మాటలు, రచయితగా, డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ తేజ, హరీష్ పని చేస్తున్నారు. కేరాఫ్ కదిరిపల్లి సినిమాకు రెడ్డెప్పరెడ్డి క్లాప్ కొట్టి ప్రారంభించారు. స్థానిక ఉపసర్పంచ్ ఇమ్రాన్, నారా రమేష్‌బాబు, శీలా జయచంద్ర, పత్తిపాటి రమేష్‌నాయుడు, ఉమర్ ఫారుక్, ఖాదర్‌బాషా, కాకర్ల చంద్రమౌళినాయుడు, యూత్ సహకారాన్ని అందించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి

తిరుపతి సిటీ : క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపి 140 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని న్యూ బాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి తెలిపారు. కళాశాలలో సోమవారం మహీంద్రటెక్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 140 మంది ఉద్యోగాలు సాధించారు. వారిని ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో సుమారు 800 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు.

ప్రతి కుటుంబానికీ సంపూర్ణ వైద్యం



రోగులకు మందులను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రమేష్‌బాబు

చంద్రగిరి: ప్రతి కుటుంబానికీ సంపూర్ణ వైద్యం అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం చంద్రగిరి సచివాయలం–1 పరిధిలోని ప్రజలకు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును పరిశీలించారు. వైద్య శిబిరరంలో 501 మంది వైద్య సేవలు పొందారని తెలిపారు. మరో మూడు రోజులు చంద్రగిరి పట్టణంలోని నాలుగు సచివాలయ ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవో ప్రతిభ, ఈవో మహేశ్వరయ్య, ఉప సర్పంచ్ నగరి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ బండారు హేమ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.